క్లుప్తంగా

సచివాలయం ఆకస్మిక తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజు నాయుడు

కళ్యాణదుర్గం రూరల్: బోరంపల్లి సచివాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్, ఇంటి పన్ను వివరాల కంప్యూటరీకరణ, హౌస్ టు హౌస్ జియో ట్యాగింగ్, సర్వేలను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు విధులకు సకాలం హాజరై ప్రజలకు సేవలందించాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాటుసారా ఊట ధ్వంసం



నాటుసారా ఊటను పారబోస్తున్న దృశ్యం

కంబదూరు: కంబదూరు, కుందుర్పి మండలాల్లోని డీ.చెన్నేపల్లి గ్రామశివారు ప్రాంతంలో నాటుసారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం దాడులు చేశారు. 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కుందుర్పి మండలం నిజవల్లిలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని నుంచి 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా ఊట ధ్వంసం

కళ్యాణదుర్గం రూరల్: ముద్దినాయపల్లి గ్రామం, శివారులో సోమవారం అనంతపురం ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. 400 లీటర్ల నాటుసారా, 25 కేజీల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వరలక్ష్మి అనే మహిళపై కేసు నమోదు చేశారు. దాడుల్లో సీఐ అన్నపూర్ణ, ఎస్‌ఐ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

డి హీరేహాళ్ (రాయదుర్గం): డీ హీరేహాళ్ మండలంలోని మలపనగుడి శివారులో పేకాట ఆడుతూ తొమ్మిది మంది సోమవారం పట్టుబడినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. పేకాట రాయుళ్లు మారేష్, కరిబసప్ప, నగేష్, తిప్పేస్వామి, హనుమంతు, నింగప్ప, ఉమేష్, వన్నూర్‌స్వామి, సిద్దాపురానికి చెందిన తిప్పేస్వామి నుంచి రూ.12,900 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో సిబ్బంది నగేష్, నాగరాజు, మోహన్, మల్లికార్జున పాల్గొన్నారు.

తెగుళ్లతో తగ్గిన వేరుశనగ దిగుబడి



వేరుశనగ తూకం వేస్తున్న అధికారులు

కూడేరు: ఖరీఫ్‌లో బోరు బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంట తెగుళ్లతో దిగుబడి బాగా తగ్గి పోయిందని విజయవాడ డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ స్టాటిస్టిక్స్ జాయింట్ డైరెక్టర్ బసవరాజు తెలిపారు. సోమవారం ఉదిరిపికొండలో వేరుశనగ పంట కోత ప్రయోగాన్ని మండల అధికారులు చేపట్టారు. ఈ పంట కోత ప్రయోగాన్ని జాయింట్ డైరెక్టర్ తనిఖీ చేశారు. 5x5 మీటర్ల కొలతల విస్తీర్ణంలో 2 కేజీల దిగుబడి వచ్చింది. పంటకు ఎక్కువగా తెగుళ్లు ఆశించాయని రైతులు అధికారుల ఎదుట వాపోయారు. దిగుబడి బాగుంటే 5 గీ5 మీటర్ల కొలతలో 4–6 కేజీల వరకు వస్తుందని జాయింట్ డైరెక్టర్ తెలిపారు. డిప్యూటీ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ కృష్ణా నాయక్ , మండల ఏఎస్ఓ ఆశా, వీఆర్వో లక్ష్మన్న , వీఏఏ,వీహెచ్ఏలు పాల్గొన్నారు.

సమస్యలపై ఫిర్యాదు చేయండి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని వార్డుల్లో నీరు, వీధిదీపాల సమస్యలపై ప్రజలు తమ వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేయొచ్చని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సచివాలయ పరిధిలో సంబంధిత శాఖ సిబ్బంది, అధికారుల పేర్లు, వారి ఫోన్ నంబర్లను సచివాలయం వద్ద ప్రదర్శించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని 18 వార్డు సచివాలయల్లోనూ విభాగాల వారీగా అధికారులు, సిబ్బంది పేర్లు, ఫోన్ నంబర్లు ఉంటాయన్నారు. వీధిదీపాలు, నీటి సమస్యలతో పాటు పారిశుధ్యం, ఖాళీ స్థలం పన్నుతో పాటు ఇంటి పన్ను బదలాయింపు, కొత్త ఇంటి పన్ను విధింపు, ఆస్తి పన్ను బదలాయింపు, నీటి కొళాయి కనెక్షన్లకు ఎలాంటి పత్రాలు కావాలో ఎవరిని సంప్రదించాలో బోర్డులో తెలియజేయనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు సరికాదు

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు, అక్రమ కేసులతోపాటు ప్రశ్నించే గొంతుకలను నొక్కడం రాజ్యాంగ ఉల్లంఘనేనని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. మంగళవారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం జరగనుంది. ఈసందర్భంగా పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి తలారి రంగయ్య నివాళులర్పించారు.

ఏ మెనూ చెప్పేది..

అంగన్‌వాడీలపై ధరల భారం

- పాత చార్జీలతోనే మెనూ అమలు చేయాలంటున్న ప్రభుత్వం
- అప్పుల పాలవుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు
- మెనూ చార్జీలు పెంచాలని వేడుకోలు



ఉరవకొండలోని అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం చేస్తున్న చిన్నారులు

ఉరవకొండ:ఏ'మెనూ' చెప్పేది అన్నట్లుంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పరిస్థితి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మెనూ ప్రకారం చిన్నారులకు భోజనం అందించాలని ఆదేశాలు జారీ చేసింది. మెనూకు తగ్గట్టు పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం అందించాలంటే ధరాఘాతమవుతోంది. కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలూ అమాంతం పెరుగుతున్నాయి. అప్పులు చేసి మెనూ అమలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి.వాటి పరిధిలో 1,025 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. పూర్వ ప్రాథమిక విద్య (ప్రీస్కూల్) కోసం కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాల్సి ఉంటుంది. కేంద్రాలకు ప్రభుత్వమే బియ్యం, నూనె, కందిపప్పు, గుడ్లు, పాలు అందిస్తోంది. చిన్నారుల సంఖ్యకు అనుగుణంగా ఎంత మేరకు సరుకులు అవసరమో ఇండెంట్ ఇస్తే సరుకులు పంపిణీ చేస్తారు. కందిపప్పు, రేషన్ బియ్యం ప్రతి నెలా రేషన్ దుకణాల ద్వారా తెచ్చుకోవాల్సి ఉంటుంది. సరుకులు తరలించేందుకు కేంద్రంలో జాగ్రత్తగా నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి నగదూ చెల్లించదు.

కేటాయింపులు ఇలా:

ఒక్కో చిన్నారికి రోజుకు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పు, 5 గ్రాముల నూనె మాత్రమే ప్రభుత్వం కేటాయిస్తుంది. వంట తయారీకి సంబంధించి ఒక్కో చిన్నారిపై రోజుకు రూ.1.50, ఇంధన (గ్యాస్) చార్జీల కింద 50 పైసలు చొప్పున నెలలో 25 రోజులు పనిదినాలకు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ మొత్తంతో చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాల్సి ఉంటుంది. అయితే నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చే బిల్లులు సరిపోవడం లేదు. అంగన్‌వాడీలు సొంతంగా కొంత మొత్తం ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

భారీగా పెరిగిన ధరలతో అవస్థలు..

ప్రస్తుతం కూరగాయల ధరలు భారీగా పెరిగిపోవడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.800 ఏమాత్రం సరిపోవడం లేదు. గ్యాస్‌కు సైతం నగదు చెల్లింపు మూడు నెలలవుతున్నా జరగకపోవడంతో అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతున్నారు. పలు సందర్భాల్లో సొంత డబ్బు వెచ్చించి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి అంగన్‌వాడీ సిబ్బందికి ఏర్పడింది. మెనూ తప్పక పాటించాలని చెప్పే ఉన్నతాధికారులు పెరిగిన ధరలకు అనుగుణంగా నగదు మొత్తాన్ని మారిస్తే బావుంటుందని అంగన్‌వాడీలు అంటున్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఉచిత గ్యాస్ అంగన్‌వాడీలకు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అంగన్‌వాడీలు కోరుతున్నారు.

మెనూ ఇలా:

సోమవారం: దోసకాయ పప్పు, ఉడికించిన కోడిగ్రుడ్డు పాలు (100 మి.లీ)
మంగళవారం: పులిహోర, టమాటాపప్పు, కోడిగ్రుడ్డు, పాలు
బుధవారం: ఆకుకూర పప్పు, కోడిగ్రుడ్డు, పాలు
గురువారం: ఆకుకూర, కూరగాయలతో సాంబారు, కోడిగ్రుడ్డు, పాలు
శుక్రవారం: బీర లేదా సొరకాయ పప్పు, మునగాకు లేదా పాలకూరతో కూర, కోడిగ్రుడ్డు, పాలు
శనివారం: వెజిటబుల్ రైస్, ఆకుకూర కూర, కూరగాయలతో సాంబారు, కోడిగ్రుడ్డు, పాలు

ఐసీడీఎస్ లబ్ధిదారుల వివరాలు

ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	7నెలలు - 3 ఏళ్లలోపు	3- 6 ఏళ్లలోపు పిల్లలు
రాయదుర్గం	185	1910	1964	8,998	5,571
ఉరవకొండ	325	1903	1861	12027	6118
కళ్యాణదుర్గం	79	1100	1930	4455	2968
కణేకల్లు	138	1126	1014	1200	3000
కంబదూరు	198	1188	1122	5907	4,824

ప్రభుత్వానికి నివేదించాం



పెరిగిన ధరలకు అనుగుణంగా నగదు పెంపు విషయాన్ని ఇది వరకే అంగన్‌వాడీలు మా దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం అంగన్‌వాడీలకు కూరగాయాలు, ఇతర అవసరాలకు అందిస్తున్న నగదు పెంపు విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం.

– బీ.ఎన్ శ్రీదేవి, ఐసీడీఎస్, పీడీ, అనంతపురం

హింస లేని సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

కణేకల్లు: హింస లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి పేర్కొన్నారు.సోమవారం కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో మహిళలను గౌరవిద్దాం... రక్షిద్దాం, స్త్రీలపై హింస వద్దు.. అహింసే ముద్దు అంటూ మహిళలు నినదించారు. అనంతరం జరిగిన సమావేశంలో తిప్పేస్వామి మాట్లాడుతూ ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మి లాంటిదన్నారు. ఆడపిల్లలు చదివి విద్యావంతులైతే ఆ ఇల్లు సుఖసంతోషాలతో ఉంటుందన్నారు. గృహ హింస, మానసిక హింస, లైంగిక హింస, మాటలు, చివాట్లతో హింస, ఆర్థిక పరమైన వేధింపులతో హింసిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు కలిసికట్టుగా ముందుకు నడిచి స్త్రీ హింసలను రూపుమాపాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నిధిషా, ఆర్ఈ చంద్రశేఖర్, ఎస్‌టీఎల్ హుసేన్‌బీ, వసంత, సీఓలు హనుమంతరాయుడు, నాగరాజు, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించాలి

వజ్రకరూరు: మండల కేంద్రంలో సోమవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనుంచి మెయిన్‌రోడ్‌మీదుగా మెయిన్‌బజార్‌లోని గాంధీ సర్కిల్‌వరకు ర్యాలీ చేశారు. ఈఓఆర్డీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈనెల 19 నుంచి డిసెంబర్ 10 వరకు మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సర్పంచు మోనాలిసా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మంజునాథ్, ఎంఈఓ ఎర్రిస్వామి, వైద్యాధికారిసర్దార్‌వలి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, హౌసింగ్ ఏఈ చెన్నారెడ్డి, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, మండల కోఆర్డినేటర్ శివశంకర్, గ్రామ కార్యదర్శి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కూడేరు సీఐగా రాజు

కూడేరు: కూడేరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రాజును ఉన్నతాధికారులు నియమించారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడ సీఐగా పని చేసిన శివరాముడు ముదిగుబ్బకు బదిలీపై వెళ్లారు.

పట్టణ సీఐగా యువరాజ్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ నూతన సీఐగా యువరాజ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అక్కడ పనిచేస్తున్న సీఐ వెంకటరమణ వీఆర్‌కు వెళ్లడంతో అనంతపురం వీఆర్‌లో పని చేస్తున్న యువరాజ్ కళ్యాణదుర్గం వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ యువరాజ్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేదిలేదన్నారు.

ప్రభుత్వ గృహాల కోసం దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గంటౌన్: సొంత స్థలం ఉండి, ఇల్లు నిర్మించుకోవాలనుకున్న అర్హులు దరఖాస్తు చేసుకోవాలని రాయదుర్గం డివిజన్ హౌసింగ్ డీఈఈ డి.రంగస్వామి యాదవ్ సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సొంత స్థలం కలిగి ఉండి గతంలో ప్రభుత్వ గృహం మంజూరుకాని వారు మాత్రమే అర్హులన్నారు. స్థలం పత్రాలను సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత పత్రాలు స్వీకరించనున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కంబదూరు: కదిరిదేవరపల్లి గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సు–కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. బెంగళూరు నుంచి కళ్యాణదుర్గం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదే దారిలో కళ్యాణదుర్గం నుంచి పావగడ వైపు వెళ్తున్న కారును ఢీ కొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జయ్యింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. వీరంతా కళ్యాణదుర్గానికి చెందిన వారు. గాయపడిన వారు కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వజ్రకరూరు:మండలంలోని చిన్నహోతూరు వద్ద ఐదుగురి పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగస్వామి సోమవారం తెలిపారు. వారి నుంచి రూ.2300 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

వినతులు వెల్లువ

కూడేరు:స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. తహసీల్దార్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో సిబ్బంది భూ, ఇతర సమస్యల పరిష్కారానికి వినతులు స్వీకరించారు. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, హౌసింగ్ ఏఈ హనుమప్ప, ఎంఈఓ హమమ్మద్ గౌస్ ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగ దివ్య, అధికారులు హాజరయ్యారు.

వడ్డేపాళ్యంలో వాల్మీకి జయంతి



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కుందుర్పి: మండలంలోని వడ్డేపాళ్యంలో వాల్మీకి జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు డీఎస్ మూర్తి, సర్పంచ్ ఓబన్న, ఎంపీటీసీ సభ్యుడు ఈరన్న, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గోవిందప్ప, నాయకులు పెద్దరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలి

కళ్యాణదుర్గం రూరల్: బీటీపీ కాలువ కోసం భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని, చెరువులు మరమ్మతు చేయాలని, నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ కోరారు. సోమవారం ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ హాజరై నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

కేన్సర్ సర్వే వేగవంతం చేయాలి

గుమ్మఘట్ట: కేన్సర్ సర్వేను వేగవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లపైబడిన వారికి కేన్సర్ పరీక్షలు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు రక్త పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు బాలాజీనాయక్, సందేశ్‌కుమార్, సీహెచ్ఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

చలికాలం వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గంటౌన్: సీతాకాలంలో చలితీవ్రతతో వచ్చే టీబీ, నిమోనియా, ఆస్మా తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్, ఆరోగ్య విద్యాబోధకుడు లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలోని 18వ వార్డులో చలికాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు సుజాత, అరుణ, లలిత, సునీత, శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈరన్న,బొమ్మలింగేశ్వరస్వామి జాతర



స్వామివారిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

కుందుర్పి: మండలంలోని మహంతపురంలో సోమవారం ఈరన్న,బొమ్మలింగేశ్వరస్వామి జాతర ఘనంగా జరిగింది. ఉదయం స్వామికి క్షీరాభిషేకం, అంకురార్పణం, కుంకుమార్చన పూజలు చేశారు. సాయంత్రం గ్రామ శివారులోని విడిది వద్ద స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రైతులు పానకం బండ్లతో వెళ్లి స్వామివారి విడిది చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. కదరంపల్లి, అప్పిలేపల్లి, కుందుర్పి, బెస్తరపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేపట్టారు.

వైభవంగా ముగిసిన ఆలయ వార్షికోత్సవం

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీరంగాపురం క్యాంప్ గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయ 25వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా ముగిసింది. స్వామి మూల విరాట్‌కు విశేష పూజలు జరిపించి పుష్పాలంకరణ చేశారు. 108 కలశాలు , లీటర్ల పాలను ఆలయ గోపురంపై అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో యాగశాల నిర్వహించారు.

విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి



శెట్టూరు ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ భమరాంబదేవి

శెట్టూరు: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ ఈ భ్రమరాంబదేవి హెచ్చరించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని సిబ్బంది హాజరు, విధుల నిర్వహణను ప్రత్యేకంగా పరిశీలించారు. ఆస్పత్రిలో రోగుల కోసం సౌకర్యాలు, ఓపీ చికిత్సల రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రసవాలు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. గర్భిణులు, బాలింతల చికిత్సలపై అశ్రద్ధ చేయవద్దని సూచించారు. ఆసుపత్రిని శుభ్రంగా ఉంచాలని, గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు అందుబాటులో ఉండాలని, గ్రామ స్థాయిలో వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రాజేష్‌కుమార్, తరుణసాయి, సిబ్బంది లీలావతి, శోభాలత, యామిని జోతి, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళన



ఆందోళనకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మహబూబ్ బాషా

కూడేరు: కూడేరు పొలం సర్వేనంబర్ 535 (ప్రభుత్వ భూమి)లో సాగులో ఉన్న రైతులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి హెచ్చరించారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట ధర్నా చేశారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా అరవకూరు, కడదరకుంట, కూడేరుకు చెందిన అనేక మంది రైతులు 535లో గల గుట్టలు, కొండలను కష్టపడి చదునుచేసుకొని పంటలు సాగు చేసుకుంటూ వస్తున్నారన్నారు. కానీ ఆ భూమిని ఏపీఐఐసీకి కేటాయించడం చాలా దారుణమన్నారు. తహసీల్దార్ మహబూబ్ బాషా వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల నేతలు కరీం సాబ్, వెంకటేశులు, చిదంబరమ్మ, అలివేలమ్మ, శ్రీనివాసులు, రామాంజనేయులు, గంగాధర్, చౌడన్న, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రాయదుర్గంటౌన్: పట్టణానికి చెందిన ట్యాక్సీ డ్రైవర్ అబ్దుల్లా నెలరోజుల క్రితం మృతిచెందాడు. అబ్దుల్లా జ్ఞాపకార్థం అతని పేరుమీద ట్యాక్సీ డ్రైవర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జామియా అన్వారుల్ మదరాసాలో ఒక విద్యార్థికి ఏడాదికి అయ్యే ఖర్చు రూ.10,200 ప్రిన్సిపాల్ ముఫ్తి నూర్‌మహమ్మద్‌కు అందించారు. కార్యక్రమంలో డ్రైవర్ల అసోసియేషన్ సభ్యులు కిరణ్‌కుమార్, రామాంజనేయులు, తిప్పేస్వామి, బాషా, మదరసా కమిటీ సభ్యులు జక్రియసాబ్ పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరా నమోనమామి!



రాయదుర్గంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం





కంబదూరులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు , రాయదుర్గంలో నగరేశ్వరస్వామికి పూజలు



రాయదుర్గంలో కలశాలతో మహిళల ఊరేగింపు

- చివరి సోమవారం ఆలయాల్లో కార్తీక సందడి



కార్తీక దీపారాధన



ప్రత్యేక అలంకరణలో అక్కమ్మవారు

రాయదుర్గంటౌన్/కూడేరు/కంబదూరు/వజ్రకరూరు/కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని శివాలయాలతోపాటు ప్రముఖ ఆలయాల్లో కార్తీక చివరి సోమవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కోటలో వెలసిన నగరేశ్వరస్వామికి బస్మాభిషేకం చేశారు. పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చనతో మహామంగళ హారతి నిర్వహించారు. బళ్లారి రోడ్డులో వెలసిన నీలకంఠేశ్వరుడికి కుంభాభిషేకం నిర్వహించారు. కోటలో వెలసిన జంబుకేశ్వరస్వామి ఆలయలో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణంలోని శ్రీభక్త మార్కండేయ స్వామి ఆలయంలో సామూహిక దీపారాధన మిన్నంటింది. పట్టణంలోని బసవేశ్వరస్వామి, వీరభద్రస్వామి, చంద్రమౌళేశ్వరస్వామి, చన్నవీరస్వామి ఆలయాల్లో కార్తీక చివరి సోమవారం పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ధాత్రి హోమం, వన భోజనం

రాయదుర్గం మండలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చివరి సోమవారం కార్తీక దామోదర ధాత్రి హోమం, వన భోజన ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున సామూహిక సహపంక్తి వన భోజనాలు ఏర్పాటు చేశారు.

జోడులింగాల ఆలయానికి భక్తుల తాకిడి

కూడేరు: కార్తీమమాసం చివరి సోమవారం కావడంతో కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయానికి జిల్లా నలమూలల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

కంబదూరు: మండల కేంద్రంలోని పురాతన కమల మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని మహిళలు దీపాలను వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు.

వజ్రకరూరు: మండలంలోని నగరేశ్వరస్వామి, భోగేశ్వర స్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. జరుట్లరాంపురంలోని జరుట్లరామలింగేశ్వర స్వామికి పూజలు చేశారు. కొనకొండ్ల ఛాయామల్లేశ్వర స్వామి ఆలయంలోనూ పూజలు చేశారు.

కనుల పండుగా కార్తీక మహోత్సవం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని అక్కమ్మగార్ల ఆలయంలో సోమవారం కార్తీక వనమహోత్సవం సందర్భంగా మహిళలు జ్యోతులు వెలిగించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం భక్తులు కోటి ఒత్తులతో దీపం వెలిగించారు.

గుమ్మఘట్ట: మారెంపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు కార్తీక వనమహోత్సవాన్ని ఉపాధ్యాయులు శ్రీరాములు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఎంఈఓ నాగమణి , హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు నరసింహులు, నాగమంజు, కుళ్లాయప్ప, ఆవులదట్ల, డి.కొండాపురం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మారెంపల్లిలో సహపంక్తి భోజనం చేస్తున్న విద్యార్థులు



కళ్యాణదుర్గంలో కోటి ఒత్తుల దీపం వెలిగిస్తున్న దృశ్యం



కంబదూరులో అలంకరణలో మల్లేశ్వరస్వామి

దళితుల స్థలం ఆక్రమించడం సరికాదు



శెట్టూరు టీడీపీ నాయకుడు బసంపల్లి హనుమంతరెడ్డిని నిలదీస్తున్న గ్రామస్తులు

కళ్యాణదుర్గం: బసంపల్లిలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని దౌర్జన్యంగా కబ్జా చేయడం సరికాదని టీడీపీ నాయకులను దళితులు నిలదీశారు. సోమవారం స్థానిక ఆర్డీటీ ఎకాలజీ సెంటర్ వద్ద జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో శెట్టూరు మండలం బసంపల్లికి చెందిన దళితులు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను కలిశారు. అయితే ఇదే సందర్భంలో శెట్టూరుకు చెందిన టీడీపీ నాయకుడు హనుమంతరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బసంపల్లిలో సర్వే నం.24-1లోని 5 సెంట్ల స్థలాన్ని అంబేడ్కర్ విగ్రహ ర్పాటుకు స్థలాన్ని 30 ఏళ్ల క్రితమే రెవెన్యూ అధికారులు కేటాయించారన్నారు. కూటమి అధికారంలోకొచ్చిన తర్వాత హనుమంతరెడ్డి అనే వ్యక్తి కబ్జా చేయడానికి సిద్ధమయ్యాడన్నారు. దీనిపై కొద్దిసేపు ఇరువురితో వాగ్వాదం జరిగింది. స్థానికులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు సాకే గురుమూర్తి ఆధ్వర్యంలో హనుమంతరెడ్డిని నిలదీశారు.